# ముందుచూపు

— జె. రామలక్ష్మి



మా వీధిలో కుటుంబరావుగారికి చాలా మంచి పేరుంది. ఎన్నో విషయాల్లో ఆయన్నుచూసి నేర్చుకో వచ్చునని అంతా అనుకుంటూం టూరు. అసూయ కారణంగా నేను చాలాకాలం ఆయన్ను తప్పించుకు

తిరిగి ఆయనకంటె గొప్పవాడినని పేరు తెచ్చుకుందామని ప్రయత్నించి ఫెయిలైపోయాను.

కుటుంబరావుగారు మరీ పెద్దవాడేంకాదు. సుమారు ముప్పై అయిదేళ్ళుంటాయేమో! ఆయనకి ఇద్దరు పిల్లలు. ఇద్దరూ రోజూ ఉదయం ఎనిమిది గంటలకు బడికి పోయి, సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి వస్తూంటారు. మళ్ళీ అయిదింటికి ఆటలకని వెళ్ళి, ఏడింటికి తిరిగి వస్తారు. తొమ్మిదింటి కల్లా నిద్రపోతారు.

కుటుంబరావు వృత్తి కథలు రాయడం. ఆయనకు రాని సాహిత్య ప్రక్రియ లేదు. పాఠకుల్లో ఆయన రచనలకు మంచి డిమాండ్ ఉంది. రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. కథలుకాక భూముల మీంచి ఆయనకు ఆదాయం వస్తుంది. ఏది ఏమైతేనేం-ఆయన ఆఫీసు పేరు చెప్పి ఇల్లు కదలక్కర్లేదు.

కుటుంబరావు భార్య రాధ. వాళ్ళిద్దరిదీ చాలా అన్యోన్య దాంపత్యం. ఎక్కడికైనా వాళ్ళిద్దరూ జంటగా తప్ప వెళ్ళరు. ఇరవై నాలుగ్గంటలూ ఒకరినొకరు చూసుకునే వాళ్ళకు కనీసం బయటకు వెళ్ళేటప్పుడైనా ఏకాంతం కావాలనిపించకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. వాళ్ళు కలిసి సినిమాలు చూస్తారు. కలిసి బజారుకి వెడతారు. కలిసి షాపింగ్ చేస్తారు. బయట వాళ్ళను విడిగా చూసిన వాళ్ళు కనబడరు.

కుటుంబరావుకు ముందు చూపు గురించి మంచి పేరుంది.

మా వీధిలో ఎవ్వరూ ఎప్పుడూ కాల్‌గ్యాస్ గురించి ఇబ్బంది పడలేదు. ఇలా ఫోన్ చేస్తే అలా వచ్చిపడేది గ్యాసు సిలిండర్. ఎప్పుడైనా సెలవురోజు వస్తే ఒక్కరోజు ఆలశ్యమయేది అంతే. అలాంటి పరిస్థితుల్లో తన గ్యాస్ సిలిండర్లు చెల్లువేయడం కోసం-ఆ ఏజంటు-రెండొందల రూపాయలు డిపాజిట్ కట్టిన వారికి ఎక్స్‌ట్రా సిలిండర్ ఇస్తానని చెప్పాడు. ఏజంటు ఇలా ప్రకటించడమేమిటి? కుటుంబరావు వెళ్ళి ఆ డిపాజిట్ కట్టి ఎక్స్‌ట్రా సిలిండర్ తెచ్చుకున్నాడు. కుటుంబరావు తర్వాత ఆ వీధిలో నాలుగు డబ్బులున్నవాణ్ణి నేనే! ఈ ఎక్స్‌ట్రా సిలిండర్ కొనడం శుద్ధ దండుగ అనీ, ఒళ్ళువాచి ఉంటేతప్ప చేయవవసరంలేదనీ నేను చెప్పాను. చూస్తూ చూస్తూ రెండొందలు దానికి తగలేయడం నాకు నచ్చ

లేదు. అప్పో సప్పోచేసి ఆ సిలిం డరు తెచ్చుకుందామనుకుంటున్న మా వీధి జనం నా సలహాపై ఆ ఉద్దేశ్యం మానుకున్నారు. కుటుంబ రావు మాత్రం ఒకరిద్దరితో- "ఈ ఎక్స్ట్రా సిలిండర్లు ఎంతో కాలం ఇవ్వడు. స్తోమతుంటే గ్యాసు పొయ్యికి మించిన సౌఖ్యం లేదు. ఆ సౌఖ్యం ముందు రెండొందలో లెక్కకాదు. దేశంలో ఇప్పటికే చాలా చోట్ల గ్యాసుకు ఇబ్బంది వచ్చింది. మనూరికి ఇబ్బంది రావ డానికెంతో కాలం పట్టకపోవచ్చు. ఉన్న సదుపాయాన్ని స్తోమతుగల వాళ్ళందరూ ఉపయోగించుకోవడం మంచిది" అన్నాడట. వాళ్ళాయన మాట చెవిన పెట్టలేదు.

కానీ ఆయన అన్నంత పనీ జరిగింది. సరిగ్గా నెల్లాళ్ళకు ఎక్స్ట్రా సిలిండర్స్ ఇవ్వడం మానేశాడు ఏజంటు. మరో రెండు నెలల్లో గ్యాసుకిబ్బంది వచ్చింది. గ్యాసు రావడానికొకోసారి ఇరవై రోజులు కూడా పడుతోంది. ఇందు వల్ల ఇబ్బంది పడనివాడు మా వీధికి కుటుంబరావు ఒక్కడే! గ్యాసు అయిపోగానే ఫోన్ చేసి ఎక్స్ట్రా సిలిండర్ వాడుకునే వాడు. ఆ గ్యాసు ఆయనకు కనీసం నలభై రోజులకు వచ్చేది. ఈలోగా కొత్త సిలిండర్ ఎలాగూ రానే వచ్చేది.

ఈ ఇబ్బంది ఒక నెలతో ఆగ లేదు. గత రెండు సంవత్సరాలుగా ఉంటూనే వస్తోంది. అందువల్ల కొందరు ఎలక్ట్రిక్ స్టౌ కొనుక్కు న్నారు. కొత్తగా వచ్చిన కిరోసిన్ గ్యాస్ స్టవ్స్ కొందరు కొన్నారు. అందరికీ రెండొందలు పైనే అయింది. కానీ ఎవ్వరూ కుటుంబ రావులా సుఖపడడంలేదు.

కుటుంబరావు ముందు చూపుకి అప్పుడే బాగా మంచి పేరు వచ్చింది. నేను కూడా ఆయన గొప్పతనాన్ని గ్రహించి కొంత అసూయను వదిలిపెట్టాను. ఎందు కంటే నా అసూయ నన్నేకాక ఇతరులను కూడా ఇబ్బందిపెట్టింది.

అసూయను వదిలిపెట్టేక నేను కుటుంబరావులో గ్రహించిన ఒక ప్రత్యేకత ఉంది.

రెండు సంవత్సరాలనుంచి నా మరదలు అనగా నా భార్య చెల్లెలు మాతోనే ఉంటోంది. చదువు గురించి మామగారామెను నా దగ్గర వదలి పెట్టారు. ఆమె ఇంట ర్మీడియేట్ ఫైనలియర్ చదువు తోంది. స్వయానా అక్కచెల్లెళ్ళై నప్పటికీ - వాళ్ళిద్దరికీ ఎప్పుడూ పడదు. రోజూ ఇంట్లో దేనికో

దానికి పెద్ద గొడవ అవుతూనే ఉండేది. ఇబ్బంది ఏమిటంటే ఇద్దరూ నాతోనే ఫిర్యాదు చేసేవారు. చూస్తూ చూస్తూ కట్టుకున్న భార్యను తప్పు పట్టలేను. అందువల్ల దుష్పరిణామాలుంటాయని అనుభవ పూర్వకంగా నాకు తెలుసును. అలాగని మరదల్నీ ఏమీ అనలేకపోయేవాణ్ని. ఎందుకంటే నా మరదలు నా భార్యకంటె అందంగా ఉంటుందన్నది నేనింత వరకూ నా భార్యకు చెప్పని నిజం.

నా ఇంట్లో విషయమిలా ఉంటే కుటుంబరావు ఇంట్లోనూ ఎనిమిది నెలల క్రితం ఒక కొత్త మెంబర్ వచ్చింది. ఆమె కుటుంబరావు చెల్లెలు. నా మరదలు ఈడుది. కుటుంబరావు భార్య, చెల్లెలు చాలా అన్యోన్యంగా స్వంత అక్కచెల్లెళ్ళలా ఉంటారని మా వీధిలో వింతగా చెప్పుకునేవారు. స్వంత అక్కచెల్లెళ్ళ అన్యోన్యమెలా ఉంటుందో తెలిసిన నేను మొదట్లో ఆ విషయం పట్టించుకోలేదు. కానీ తర్వాత వాళ్ళ అన్యోన్యం నేననుకునేంతటిది కాదని తెలిసిపోయింది. వాళ్ళిద్దరూ దేనికీ దెబ్బలాడుకోరు. ఎప్పుడూ నవ్వుతూ కనబడతారు. ఒకరి మాటను ఒకరు ఖండించరు. అయినా ఇద్దరిదీ ఒకే మాట కూడాను. ఈ విధమైన సభ్యతకు కారణం కుటుంబరావా లేక ఆ ఆడవాళ్ళ గొప్పతనమా?

కుటుంబరావు భార్యపట్ల పక్షపాతంగా వ్యవహరిస్తాడు. పెళ్ళానికి వంద రూపాయల చీర కొని, చెల్లెలికి యాభై రూపాయల చీర కొంటాడు. అయినా అతడి చెల్లెలు అతన్నీ, వదిన్నీ అభిమానిస్తోందంటే ఆమె గతి లేనిదేనా అవ్వాలి, లేక చాలామంచిదేనా అయ్యుండాలి. ఆడవాళ్ళలో మంచితనముంటుందని నాకు తోచదు.

నేను నా మరదలకీ, భార్యకూ ఒకే ఖరీదు చీరలు కొంటాను. ఈ విషయం నా శ్రీమతికి నచ్చలేదు. నా నిష్పక్షపాత వైఖరిని ఆమె ఆమోదించలేదు. మరదళ్ళ కోసం ఎవరైనా ఎక్కువ ఖర్చు చేస్తారుట. మొహమాటానికి ఊరుకున్నాను. కానీ-తనూరుకుంటే అసలు మరదలికే ఎక్కువ ఖరీదు చీరకొంటానుట. ఈ విషయంలో నా భార్య కుటుంబరావు అభిప్రాయం చెప్పింది-"నా చెల్లెలు పెళ్ళికాని పిల్ల. ఇంకా ఇలాంటి చెల్లెళ్ళు నాకు ఇద్దరున్నారు. వాళ్ళందరూ నానించి ఏదో ఆశిస్తారు. నా పెళ్ళాంతో సమంగా వాళ్ళకు జరపాలంటే నా ఆదాయం చాలదు. అలా

గని నా భార్యకు తక్కువ చేద్దామా అంటే అనుభవించవలసిన వయసులో ఆమె సరదాలు తీర కుండా పోతాయి. రేపు పెళ్ళయితే నా చెల్లెల్ని భర్త చూసుకుంటాడు" అన్నాడుట కుటుంబరావు.

ఈ మాటలు నాకూ నచ్చాయి.

ఇలా కొంతకాలం జరిగేక కుటుంబరావు చెల్లెలికి గజ్జెలు కొన్నాడు. భార్యకు మాత్రం కొనలేదు. ఇది నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది చూసి నా మరదలు తనకూ గజ్జెలు కావాలనీ, తన అక్కకు కొనడానికి వీల్లేదనీ పట్టుబట్టింది. ఇద్దరికీ గజ్జెలు కొనే పక్షంలో తన కూ్కడా అక్కతో సమంగా ఖరీదైన చీరలు కొని పెట్టాలిట!

నా భార్యకు గజ్జెలు కొనుక్కోవాలనుంది. మరదలి పట్టుదల నన్ను, ఆమెను కూడా ఇరకాటంలో పెట్టింది.

ఇంట్లో పోరు భరించలేక నేను చివరికి ఇద్దరికీ గజ్జెలు కొనాలనే నిర్ణయించుకున్నాను. అయితే అలా చేసేముందు ఒక పర్యాయం కుటుంబరావును కలవడం మంచి దనిపించింది. నా అహాన్ని చంపుకుని ఒక రోజు ఆయన ఇంటికి వెళ్ళి పలకరించి, మాటలతో దారుణంగా ఉబ్బేసి-అదే పనిగా పొగిడి ఆఖరున మా ఇంట్లో గజ్జెల గురించిన సమస్య చెప్పాను.

అంతా సావధానంగా విని కుటుంబరావు నవ్వాడు-"చూడండి, ఇది చాలా సింపుల్. పిల్లలిద్దరూ పొద్దున్నే స్కూలుకు పోతారు. సాయంత్రం మళ్ళీ ఆటలకు పోతారు. ఇంట్లో కూర్చోవడమే నా ఉద్యోగం. చాలా కాలంగా మా దంపతులం ఏకాంతంగా ఉండడానికి అలవాటుపడ్డాం. ఇటీవల మా చెల్లెలు వచ్చింది. దానికి కబుర్లెక్కువ. ఒక్కర్తీ కూర్చుని చదువుకోదు. ఏదో సమయంలో మా గదికి వస్తూంటుంది. సాధారణంగా నేను రాసుకుంటూంటాను. శ్రీమతి చదువుకుంటూంటుంది. కాని మధ్యలో ప్రవర్తన మారుతుండవచ్చుగదా! ఎప్పుడు నా చెల్లెలు రంగ ప్రవేశం చేస్తుందో తెలియదు గదా? అందుకని పిల్లి మెడలో గంట కట్టాం. అంతే! వదినక్కూ్కనకుండా తన కొక్కర్తికే గజ్జెలు కొన్నందుకు నా చెల్లెలు పొంగిపోయింది కూడా."

కుటుంబరావు మాటలు వినగానే ఇటువంటి ఇబ్బంది నాకూ ఉన్న దనిపించింది.

ఇంటికి వెళ్ళి ఈ విషయం చెప్పగానే శ్రీమతి తనకు గజ్జెలు వద్దని వెంటనే చెప్పేసింది.

అప్పట్నించీ నేను కుటుంబరావు అభిమానిని అయ్యాను. *